క్లుప్తంగా

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న గిరిజన నాయకులు

కథలాపూర్: పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు ఆదివారం మండల గిరిజనులు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు తమ గోడును వినోద్‌కుమార్‌కు విన్నవించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, జిల్లా అటవీశాఖ అధికారికి విన్నవించామని, పరిష్కారం కాలేదని వాపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, గిరిజన సంఘం నాయకులు రవినాయక్, మెగ్యానాయక్, దేవదాస్, అంజినాయక్, శంకర్‌నాయక్, రాజన్ననాయక్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు



జోగిన్‌పెల్లిలో ఓటు నమోదు చేస్తున్న బీఎల్‌వోలు

కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కిషన్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఫామ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేయాలని సూచించారు.ఒక పీఎస్ నుంచి మరో పీఎస్ కు మార్చుకునేందుకు ఫామ్ 8 ద్వారా నమోదు చేయాలని పేర్కొన్నారు.దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడ్డ వారి జాబితా సిద్ధం చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రాజారాం,భూమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన



ప్రజలను కలుస్తున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: బీజేపీతోనే తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందుతుందని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ నాయకుడు డాక్టర్ ఎడమల శైలేందర్‌రెడ్డి అన్నారు. గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కిమ్‌నాయక్‌తండా, భీంరెడ్డిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించి బీజేపీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటా కరపత్రాలను కార్యకర్తలతో కలిసి పంచుతూ విస్తృతప్రచారం చేశారు. పార్టీ ఆదేశిస్తే తాను ఎమ్మెల్యేకు పోటీ చేస్తానని చెప్పారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న ఏఎస్సై

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోస్కుల గంగాధర్ గత కొద్ది రోజుల క్రితం జగిత్యాల పట్టణంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్ ఫోన్‌ను కనుగొని, ఆదివారం ఏఎస్సై వెంకటేశ్వర్ రావు బాధితుడికి అందజేశారు.

మెరిసిన ఇంద్రధనస్సు



జగిత్యాలరూరల్: ఆకాశం మబ్బులతో వర్షం కురుస్తున్న సమయంలోనే మబ్బుల్లో ఇంద్రధనస్సు పలువురిని కనువిందు చేసింది. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లిలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసిన తర్వాత మబ్బుల్లో ఇంద్రధనుస్సు ఏర్పడగా పలువురు ఆసక్తిగా చూశారు.

అసైన్డ్ భూములకు అందని రుణాలు

- రైతు బంధు ఇస్తున్నా.. రుణాల జాడేది?
- సహకార సంఘాల విముఖత
- రెన్యూవల్ చేస్తున్న పాత అప్పులు
- ధరణితో రుణాలు రాని వైనం



తాళ్ల ధర్మారంలో అసైన్డ్ భూమిలో పంట సాగుచేసిన రైతులు

సారంగాపూర్: దేవుడి వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది అసైన్డ్ భూముల రైతుల పరిస్థితి. ప్రభుత్వం అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి, రైతు బంధు అందించినా.. బ్యాంకులు, సొసైటీలు రుణాలు అందించడం లేదు. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. 2015–16 సంవత్సరం వరకు సొసైటీలు, గ్రామీణ బ్యాంకులు పంట రుణాలు అందించాయి. ఆ తరువాత ధరణి రావడంతో అసైన్డ్ భూములకు దాదాపు ఏడు సంవత్సరాల నుండి రుణాలు అందించడంపై ప్రతిష్టంభన ఏర్పడింది. తమ భూములపై అప్పులు ఇవ్వకపోవడంతో భూములను అభివృద్ధి చేసుకోలేక పోతున్నారు. రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తీసుకువచ్చి పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు.

బీర్‌పూర్ మండలంలో సగం వరకు అసైన్డ్ భూములే

బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం దాదాపు 12 వేల ఎకరాల్లో రైతులు పంట సాగుచేస్తున్నారు. ఇందులో 6వేల ఎకరాల వరకు ప్రభుత్వం అందించిన అసైన్డ్ భూములు ఉన్నాయి...ఇక్కడ బీర్‌పూర్, కొల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు, బీర్‌పూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు రైతులకు పంట రుణాలు అందిస్తూ వస్తున్నాయి.

అసైన్డ్ భూములకు రుణాలు అందించకపోవడానికి కారణాలు..

- అసైన్డ్ భూములకు 2015–16 నుంచి పంట రుణాలు ఇవ్వడం నిలిపివేశారు
- అసైన్డ్ భూముల్లో ఒకే సర్వే నంబర్‌లో వందలాది మంది రైతులు పట్టాలు కలిగి ఉంటారు. అటువంటి సమయంలో భూమిని మార్ట్‌గేజ్ (తనఖా) పెట్టుకోవడంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ధరణి సిస్టంలో మార్ట్‌గేజ్‌కు అనుమతించడం లేదు.
- అసైన్డ్ భూముల్లో పట్టాలు కలిగి ఉన్న ప్రతి సర్వే నంబర్‌లో ఎంత మంది రైతులు ఉన్నా, వారికి వ్యక్తిగతంగా సర్వే నంబర్ (వ్యక్తిగత ఖాతా నంబర్) చూపించడం లేదు. ఆన్‌లైన్ రికార్డు పరంగా అసైన్డ్ భూములు ప్రభుత్వ ఖాతాను చూపిస్తున్నాయి. మండలంలోని తాళ్ల ధర్మారం లోని సర్వే నంబర్ 4లో 1350 ఎకరాల్లో రైతులకు ప్రభుత్వం పట్టాలు అందించింది. ఒకే సర్వే నంబర్‌లో 1350 ఎకరాల్లో రైతులకు వ్యక్తిగత ఖాతా నంబర్లు లేకపోవడంతో రుణాలు అందించడం సాధ్యపడడం లేదు.
- కాగా సహకార సంఘాల్లో రైతుకు 20 గుంటల పట్టా భూమి ఉండి, మరో 2 ఎకరాలు అసైన్డ్ భూమి ఉన్నా అటువంటి రైతులకు మొత్తం 2.20 ఎకరాలకు పంట రుణం అందిస్తున్నారు. కానీ మొత్తం అసైన్డ్ భూమి ఉన్న రైతులకు మాత్రం బ్యాంకులు, సంఘాలు రుణం అందించడం లేదు.

రెన్యూవల్ చేస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు...

గతంలో అసైన్డ్ భూములపై అప్పులు ఇచ్చిన తెలంగాణ గ్రామీణ బ్యాంకులు మాత్రం పాత అప్పులకు వడ్డీ తీసుకుని తిరిగి రెన్యూవల్ చేస్తున్నాయి. కానీ కొత్త రుణాలు మాత్రం అందించడం లేదు

అసైన్డ్ భూములపై పంట రుణాలు

ప్రభుత్వ పరిశీలనలో అసైన్డ్ భూములపై పంట రుణాలు ఇచ్చే విషయం పరిశీలనలో ఉందని, దీనికి సాంకేతిక సమస్యలు కారణమవుతున్నాయి. ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఇటీవల పేర్కొన్నారు. ఇప్పటికైనా అసైన్డ్ భూములకు రుణాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

రుణాలు అందిస్తేనే అభివృద్ధి



అసైన్డ్ భూములకు ప్రభుత్వం రైతుబంధు అందిస్తుంది. పంట రుణాలు వ్యక్తిగతంగా అందిస్తేనే రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసుకుని పంటలు పండించుకునే వీలుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. భూములపై పంట రుణం అందిస్తేనే భూములకు భద్రత ఎక్కువ.

– పొల్సాని నవీన్‌రావు, చైర్మన్, కొల్వాయి సొసైటీ

గ్రూపు రైతులకు రుణాలు



అసైన్డ్ భూములు కలిగి ఉన్న నలుగురు ఐదుగురు రైతులకు కలిపి, వారిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారికి జాయింట్ గ్రూప్ ఆఫ్ ఫార్మర్స్ లోన్ అందిస్తున్నాం. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రుణం ఇవ్వడం సాధ్యపడదు.

– అయ్యోరి తిరుపతి,సీఈవో, బీర్‌పూర్ సొసైటీ

నిరుపేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం మోతెలో రూ 5 లక్షలతో నిర్మించే ఎస్టీ కుల సంఘ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ సురకంటి స్వప్న, ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, సురేందర్ రావు, వెంకటేశ్, జుంబర్తి శంకర్, భిక్షపతి, ఎంపీడీవో శైలజరాణి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చూసి పార్టీలో చేరిక

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు చూసి అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు గట్ల బాలక్రిష్ణ, చిర్ర మారుతి, మెడపట్ల శేఖర్, కోలపాక అరుణ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆరె రవి, ఆరె తిరుపతి, అంకం సతీష్, యేళ్ల రాజన్నలు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

సారంగాపూర్: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లచ్చక్కపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీ కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచ్ వెంకటరమణరావు, కొండ శ్రీలత, డిల్లీ రామారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి పాల్గొన్నారు.

గుండేటి రాజుకు సన్మానం

జగిత్యాల: కళాశ్రీ వ్యవస్థాపకుడు గుండేటి రాజు కళాసేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో గుండే రాజుకు కళాసేవా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు జరిగిన సన్మానంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కళాకారులకు తెలంగాణ యాస, భాషకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు.

ధర్మపురిలో బహుజన జెండా ఎగరేస్తాం



దీకొండలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పెగడపల్లి: రానున్న ఎన్నికల్లో ధర్మపురిలో బహుజన జెండా ఎగుర వేయడం ఖాయమని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని దీకొండలో ఆదివారం బీఎస్పీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తుందని బహుజనులకు అడుగడుగున అన్యాయం జరుగుతుందని విమర్శించారు. బహుజనులకు రాజ్యాధికారం వస్తే 93 శాతం ఉన్న బహుజనుల బాధలు తొలగి బతుకులు మారుతుతాయన్నారు. రాష్ట్ర ప్రజలకు కావాల్సింది కులాల పేరుతో బందు స్కీంలు కాదని బవిష్యత్తు తరాలకు బతుకునిచ్చే స్కీంలు కావాలన్నారు. ధర్మపురికి మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి శూన్యమని, రానున్న ఎన్నికల్లో ధర్మపురి ప్రజలు మార్పు కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేశ్, కార్తీక్, తిరుపతి, రాజశేఖర్, అంజి, అజయ్, నరేశ్, మహంకాళి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ నిర్ధారణ పరీక్షలు



షుగర్ టెస్ట్ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల: పట్టణంలోని వేములవాడ రోడ్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధితో కలిగే దుష్పరిణామాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, కార్యదర్శి మహేందర్, కోశాధికారి కృష్ణప్రసాద్, లయన్స్ క్లబ్ కోటి నవదుర్గా అధ్యక్షురాలు వనపర్తి రమ్య, కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రాజన్న

ధర్మపురి: ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా జెట్టి రాజన్నను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ధర్మపురిలో సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించగా రాజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజన్నను నాయకులు ఘనంగా సన్మానించారు.

ఆదివాసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా శేఖర్

రాయికల్: మండల ఆదివాసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆత్రం శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా పిట్టల గోపి, ఉపాధ్యక్షుడిగా కుర్ర పోశెట్టి, ప్రధాన కార్యదర్శి ఆత్రం లక్ష్మణ్, కోశాధికారిగా సీతారాం, సంయుక్త కార్యదర్శిగా జంగు, ప్రచార కార్యదర్శిగా కుర్ర రవి ఆదివారం ఎన్నికైనట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కురిసెంగ వేణు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మేడిపెల్లి మండల అధ్యక్షుడిగా రమేశ్

కథలాపూర్: కాంగ్రెస్ పార్టీ మేడిపెల్లి మండల అధ్యక్షుడిగా దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఏనుగు రమేశ్‌రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ నాయకులు ఆదివారం తెలిపారు. బీసీ సెల్ మండలాధ్యక్షుడిగా మాదం వినోద్, జిల్లా ఉపాధ్యక్షులుగా నల్ల భూమారెడ్డి, ఉరుమడ్ల లక్ష్మణ్, జిల్లా ప్రధానకార్యదర్శిగా కంటి పోచయ్య, నీరటి మల్లేశంను నియమించినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ మనుమయ సేవా సంఘం అధ్యక్షుడిగా మురళి

రాయికల్: పట్టణ శ్రీ వేంకటేశ్వర విశ్వబ్రాహ్మణ మనుమయ సేవా సంఘం అధ్యక్షుడిగా గాజోజి మురళి ఆదివారం జరిగిన ఎన్నికల్లో సమీప ప్రత్యర్థులపై 37 ఓట్ల తో గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు మహేందర్‌బాబు,గట్టుపెల్లి నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ సంఘ పటిష్టత కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా, ఆదివారం దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. గ్రామానికి చెందిన నల్ల తేజశ్రీకి కాకతీయ మెడికల్ కాలేజ్ వరంగల్ లో సీటు రాగా, గాజెంగి ఫణీంద్రకు ఖమ్మం మమత మెడికల్ కాలేజీలో సీటు దక్కింది. ఈ మేరకు విద్యార్థుల ఇంటికి వెళ్లి దళిత ఐక్యవేదిక నాయకులు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు వైద్యవిద్య సీటును దక్కించుకోవడం గ్రామానికి ఎంతో కారణమన్నారు.కార్యక్రమంలో రమేశ్, నర్సయ్య, గణేశ్, రవి,రమేశ్, మహేశ్, శేఖర్,సాకలి సురేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ — పొంచి ఉన్న ప్రమాదం..



మెట్‌పల్లి రూరల్: మండలంలోని వెల్లుల శివారులో ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ వంతెన రక్షణ గోడ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడల్లో ఓ వైపు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు జంకుతున్నారు. రక్షణ గోడలు ధ్వంసమైన చోట కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు.గతంలో ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకున్న అధికారులు రక్షణ గోడల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదకరమైన ప్రాంతం వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

దేశాన్ని మోసం చేసిన వ్యక్తికి కేబినెట్ పదవా?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: పౌరసత్వం వివాదంతో వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు పార్టీ టికెట్ ఇవ్వలేదని చెప్పిన సీఎం కేసీఆర్.. కేబినేట్ హోదా పదవి కేటాయించడం దారుణమని కథలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం పోసానిపేటలో మాట్లాడారు. జర్మనీ దేశ పౌరసత్వంతో దేశాన్ని మోసం చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రభుత్వాన్ని మోసం చేయడానికి వెనుకాడడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను పక్కాగా అమలు చేస్తామని, ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, నాయకులు పులి హరిప్రసాద్, జలపతిరెడ్డి, కల్లెడ గంగాధర్, లింగంగౌడ్, వంశీ, తిరుపతిరెడ్డి సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ వెరిఫికేషన్ పకడ్బందీగా చేయాలి



బీఎల్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్

మల్లాపూర్: ఓటర్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌లో పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించి బీఎల్వోలకు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఓటర్‌లిస్ట్ నుంచి ఓట్ల తొలగింపును చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది ఓట్ల తొలగింపులో అప్రమత్తంగా ఉంటూ పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సురేష్, రాజేష్, సర్పంచ్ సరికెల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు, బీఎల్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంత్యక్రియలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో ఆదివారం అనారోగ్యంతో గుమ్ముల బుచ్చమ్మ (85) మృతి చెందింది. సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య నాయకులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, పంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే జీపీ నుంచి సాయం అందిస్తున్నామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న గడ్డం వసంత,ఆమె భర్త మురళి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు.వీరి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, వేములకుర్తి పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్,మల్లేష్, దిలీప్,ప్రవీణ్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌కు సన్మానం

కొండగట్టు: చొప్పదండి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన మొగిలిపాలెం రమేశ్ నియామకం కాగా, పూడూర్‌లో ఆదివారం కొండగట్టు ఆలయ డైరెక్టర్ వోల్లాల లింగాగౌడ్ సన్మానించారు. ఆయన వెంట గ్రామస్తులు సాగర్ తిరుపతి, ఏసు గౌడ్, భూమయ్య నర్సయ్య పాల్గొన్నారు.

రాపల్లిలో ఉచిత వైద్యశిబిరం

గొల్లపల్లి: మండలంలోని రాపల్లిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్‌తో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల శ్యాం మాట్లాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ–తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా వృద్ధుల, విద్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సంరక్షణ కోసం మొబైల్ మెడికేర్ యూనిట్ పేరిట ఉచిత వైద్య చికిత్స అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణ తేజ, విరాజిత, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్

రాయికల్: మండలంలోని మహితాపూర్,జగన్నాథ్‌పూర్, శివాజీనగర్, బోర్నపెల్లి, చింతలూర్‌లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్షాబంధన్ ముందస్తు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ రక్షణకు, సమైఖ్యతకు కలిసికట్టుగా ఉండాలన్నారు. నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనందరం దేశానికి రక్షణగా ఉండాలని అంటూ రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు సాయిమధుకర్, పందిరి లక్ష్మీనర్సయ్య, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లధర్మారంలో గొర్రెల యూనిట్లు పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తాళ్ల ధర్మారంలో ఆదివారం ప్రభుత్వం యాదవులకు పంపిణీ చేస్తున్న గొర్ల యూనిట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని 12 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 21 గొర్లచొప్పున వీటిని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ నారపాక రమ, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఎంపీసీలో 12 సీట్లు, బైపీసీలో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సోమవారం నేరుగా కళాశాలలో సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

నేటి నుంచి పెగడపల్లిలో పాఠశాల స్థాయి క్రీడా పోటీలు

పెగడపల్లి: ఈనెల 28 నుంచి 30 వరకు పెగడపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్–14, అండర్–17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్, పీఈటీ రమేశ్ ఆదివారం తెలిపారు. 28, బాలురకు, 29న బాలికలకు, 30న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేడు మెట్‌పల్లి మండలానికి మంత్రి రాక

మెట్‌పల్లి రూరల్: మండలంలోని పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. సీఆర్‌ఆర్ గ్రాంట్స్ కింద కొండ్రికర్ల గ్రామ శివారులో బ్రిడ్జి నిర్మాణానికి రూ.4 కోట్లు, పెద్దాపూర్–రామారావుపల్లె బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్ల 80 లక్షల నిధులు ఇటీవల మంజూరు కాగా నేడు శంకుస్థాపన చేయనున్నారు.